క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే మల్‌రెడ్డి పర్యటన

తుర్కయంజాల్: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి బుధవారం మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడలోని 20, 7, 8, 9, 10 వార్డులలో పలు అభివృద్ధి, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, కౌన్సిలర్లు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

భువనగిరి టికెట్ ఇవ్వండి

ఈసీ శేఖర్‌గౌడ్



డిప్యూటీ సీఎం భట్టిని కలిసి అభ్యర్థన పత్రం ఇస్తున్న శేఖర్‌గౌడ్

ఇబ్రహీంపట్నం రూరల్: త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ సీటు తనకు కేటాయించాలని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ నేత ఈసీ శేఖర్‌గౌడ్ కోరారు. గాంధీ భవన్‌లో మంగళవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి బయోడేటాను అందజేశారు. పార్టీ కోసం గత 40 సంవత్సరాలు కష్టపడి పని చేస్తున్నానని విన్నవించారు. పార్టీని నమ్ముకొని ఉన్న నాకు తప్పకుండా అవకాశం కల్పించాలని కోరారు. తప్పకుండా పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకుపోతానని తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

మల్లు రవికి నాగర్‌కర్నూల్ సీటు ఇవ్వాలి

కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి

తలకొండపల్లి: మాజీ ఎంపీ మల్లు రవిని పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా మల్లు రవిని నియమించాలని అధిష్టానానికి ఆయన సూచించారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి మల్లు రవి సేవలు అవసరమన్నారు. అపారమైన అనుభవంతో పాటు, ప్రజాదారణ పొందిన ఆయనకి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాన్ని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యాదయ్య, రమేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం



ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

తలకొండపల్లి: మండల ఎస్సై శ్రీకాంత్‌ను బీజేపీ నాయకులు సన్మానించారు. మంగళవారం శాలువాలతో ఎస్సై శ్రీకాంత్‌ను పోలీస్ స్టేషన్‌లో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హేమరాజు, నాయకులు అనిల్, పాండుప్రసాద్, శ్రీకాంత్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు సత్కారం



మాజీ సర్పంచ్ రమేశ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

యాచారం: మండల పరిధిలోని తాడిపర్తి మాజీ సర్పంచ్ దూస రమేశ్‌ను మంగళవారం గ్రామస్తులు సన్మానించారు. సర్పంచ్‌గా ఐదేళ్లు గ్రామానికి చేసిన సేవలకుగాను గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట సత్కరించారు.

ఆదిబట్ల ఇన్‌చార్జి కమిషనర్‌గా శ్రీకాంత్

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్‌రెడ్డి సెలవులపై మంగళవారం వెళ్లారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జిగా తుర్కయంజాల్ కమిషనర్ శ్రీకాంత్ బాధ్యతలు స్వీకరించారు. అమెరికా పర్యటనలో భాగంగా దీర్ఘకాలిక సెలవులపై వెళ్లనున్నట్లు తెలిసింది.

'మళ్లీ మోదీయే ప్రధాని'

తలకొండపల్లి: కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు దుగ్గపురం తిరుపతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో 400కు పైగా సీట్లు గెలుచుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

అంతా భూ మాయ!

పాతికేళ్ల క్రితం అమ్మిన భూమికి పాసుపుస్తకాలు

- అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ అధికారుల నిర్వాకం
- ధరణి పోర్టల్‌లో మళ్లీ పాత యజమాని పేరే
- గుట్టుగా తిరిగి అమ్మేందుకు యత్నం
- లబోదిబోమంటున్న ప్లాట్లు కొనుగోలుచేసినవారు



అమ్మేసిన భూమికి అధికారులు జారీ చేసిన కొత్త పాస్‌బుక్ (ఇన్‌సెట్)

సాక్షి, రంగారెడ్డి జిల్లా: రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం ..ధరణి పోర్టల్‌లోని లోపాలు మరోసారి బయటపడ్డాయి. పాతికేళ్ల క్రితం అమ్మిన భూములకు పాత యజమాని పేరున మళ్లీ పాసు పుస్తకాలు జారీ చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. క్షేత్రస్థాయిలోని భూమిని, స్వరూపాన్ని పరిశీలించకుండా కేవలం పహాణీలు చూసి ఆయా భూముల వివరాలను ధరణి పోర్టల్‌లో నమోదు చేశారు. అప్పటికే భూములు అమ్మి, వాటిలో గ్రామ పంచాయతీ అనుమతితో వెంచర్లు కూడా వెలిశాయి. ఆయా భూములు మళ్లీ పాత రైతుల పేరున నమోదు కావడం, వారికి పాసుపుస్తకాలు జారీ చేయడం , వారు మళ్లీ ఆయా భూములను అమ్మకానికి పెడుతుండటంతో ఇప్పటికే ఆయా వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు లబోదిబోమంటున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ప్లాట్లు కొనుగోలు చేసిన మధ్య తరగతి ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తోంది.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో అడ్డగోలుగా నమోదు

బండరావిర్యాల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 293లో సుమారు 300 ఎకరాల ప్రభుత్వ భూమితో పాటు పట్టా భూములు కూడా ఉన్నాయి. స్థానికంగా ఉన్న ఓ కుటుంబానికి సర్వే నంబర్ 293/అ/10/ 16/1లో ఐదు ఎకరాలు, సర్వే నంబర్ 293/అ/10/15/అలో మరో ఐదు ఎకరాల చొప్పున మొత్తం పది ఎకరాల పట్టా భూమి ఉంది. వీరు 1997లోనే దీనిలో ఐదు ఎకరాలు ఓ రియల్ ఎస్టేట్ సంస్థకు అమ్మగా, మరో ఐదెకరాలు ఇతరులకు విక్రయించారు. ఈ భూములు కొనుగోలు చేసిన సదరు రియల్ ఎస్టేట్ సంస్థ గ్రామ పంచాయతీ అనుమతితో సుమారు 25 ఏళ్ల క్రితమే వెంచర్ చేసింది. మూడేళ్ల క్రితం మరో ఐదెకరాల్లో హెచ్‌ఎండీఏ అనుమతితో వెంచర్ చేసింది. ఈ మేరకు ప్లాట్లను విక్రయించింది. పంచాయతీ అనుమతితో చేసిన వెంచర్ భూమికి నాలా కన్వర్షన్ చేయించకపోవడంతో ఆ భూమి ఇప్పటికీ వ్యవసాయ భూమిగానే రికార్డుల్లో ఉంది.

మళ్లీ అమ్మకానికి యత్నం..

ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత కొనుగోలు చేసిన వారి పేర్లు కాకుండా, పహాణీల ఆధారంగా పాత యజమాని పేరును నమోదు చేసి, ఆ మేరకు పాసు పుస్తకాలు జారీ చేశారు. దీన్ని సదరు యజమాని అవకాశంగా తీసుకున్నారు. స్థానికంగా తనకున్న రాజకీయ పలుకుబడిని అడ్డం పెట్టుకుని గతంలో అమ్మిన భూములను తన పేరున గిఫ్ట్ డీడ్ చేసుకుని, గుట్టుగా అమ్మకానికి పెట్టినట్లు తెలిసింది. పట్టా భూములకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములను తమ భూములుగా చూపిస్తూ వాటిని విక్రయించేందుకు యత్నిస్తుండగా ఈ విషయం బహిర్గతమైంది. ఇప్పటికే సదరు యజమాని నుంచి భూములు కొనుగోలు చేసి ప్లాట్లు చేసిన రియల్టర్లు అప్రమత్తమై అభ్యంతరం వ్యక్తం చేశారు. సదరు వ్యక్తి పేరున జారీ చేసిన పాసు పుస్తకాలను రద్దు చేయాల్సిందిగా కోరుతూ ఇటీవల మండల తహసీల్దార్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇదే మండల పరిధిలోని కొహెడ, తట్టి అన్నారం, పిగ్లీపూర్‌లోని పలు సర్వే నంబర్లలోని భూముల వివరాలు సైతం ఇదే విధంగా నమోదైనట్లు తెలిసింది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా

వెంచర్ భూములకు పాస్ పుస్తకాలు జారీ చేసిన అంశంపై ఫిర్యాదు అందింది. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. గతంలో ఉన్న అధికారుల హయాంలో ఇది జరిగింది. ఇందులో నాకు ఎలాంటి సంబంధం లేదు. ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై చర్యలు తీసుకుంటాం.

– రవీందర్‌దత్, తహసీల్దార్, అబ్దుల్లాపూర్‌మెట్

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

రైతు సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జంగారెడ్డి



మంచాల: కర పత్రాలు పంపిణీ చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు



తుర్కయంజాల్: కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

మంచాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని రైతు సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పెసరగాల జంగారెడ్డి అన్నారు. మండలంలోని ఆరుట్లలో ఈనెల 16న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలో మంగళవారం తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న హక్కులను కాల రాసే విధంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయన్నారు. రాజ్యాంగ బద్ధంగా కల్పించిన హక్కులను హరించి వేయడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు శ్యాంసుందర్, కృష్ణ, పాండు, మాధవి, గోపాల్, యూసుఫ్ అలీ, బుచ్చయ్య, గణేశ్, విజయ్, వినోద్, రాజు, నర్సింహ, మల్లేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

తుర్కయంజాల్: కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెకు మున్సిపల్ కార్మికులు భాగస్వాములు కావాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌కు నోటీసు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కిషన్, నాయకులు సత్యనారాయణ, మాల్యాద్రి, యాదయ్య, ముత్యాలు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా కంటి ఆపరేషన్లు

యాచారం: మండల పరిధిలోని నందివనపర్తి గ్రామానికి చెందిన 47 మందికి కంటి ఆపరేషన్లు చేశారు. ఇటీవల గ్రామంలో శంకర ఐ ఆస్పత్రి వైద్య బృందం కంటి వైద్య శిబిరం నిర్వహించింది. పరీక్షల అనంతరం గ్రామస్తులను శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. ఈ మేరకు మంగళవారం ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు జరిపి అద్దాలను అందజేశారు.



కంటి శస్త్రచికిత్సలు చేయించుకున్న గ్రామస్తులు

బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలి



మాడ్గుల: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఆమనగల్లు: ఎస్సైకి ఫిర్యాదు అందజేస్తున్న నాయకులు



కడ్తాల్: పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కాంగ్రెస్ నేతల ఫిర్యాదులు

ఆమనగల్లు: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అసభ్య పదజాలంతో దూషించిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత విజయ్, కృష్ణ నాయక్, సురేశ్ నాయక్, అలీం, నాసర్, పాల్గొన్నారు.

నాయకుల నిరసనలు

కడ్తాల్: సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర పదజాలంతో అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్ నేత బాల్క సుమన్‌పై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ శివ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదయ్య, నాయకులు సురేశ్, నర్సింహా, రవి, జంగయ్య, శివయ్య, పత్యానాయక్, దేవ్‌సింగ్ తదితరులు ఉన్నారు.

ఎంపీపీ ఫైర్

కడ్తాల్: సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నేత బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎంపీపీ కమ్లీ మోత్యానాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆమె మాట్లాడారు. వెంటనే సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని బాల్క సుమన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

దిష్టిబొమ్మ దహనం

మాడ్గుల: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీఆర్‌ఎస్ నాయకుడు బాల్క సుమన్ అసభ్య పదజాలంతో దూషించినందుకు నిరసన కార్యక్రమం మండల కేంద్రంలో చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మిద్దె రాములు నాయకులు జంగయ్య, భాస్కర్, పర్వతాలు, అరవింద్, మనోహర్, నరసింహ, కిరణ్, మహేశ్, రమేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: తెలంగాణ ఉద్యమనేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, జెడ్పీటీసీ దశరథ్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి వారు మాట్లాడారు. రాష్ట్రానికి దిశానిర్దేశం చేసిన కేసీఆర్‌ను దుర్భాషలాడటం ఎంత వరకు సమంజసమన్నారు. రాష్ట్రానికి సీఎంగా ఉన్న రేవంత్‌రెడ్డి ఎంతో హుందాగా వ్యవహరించాల్సిన స్థాయిలో ఉండి అనుచితంగా మాట్లాడటం సబబు కాదన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఆనంద్ నాయకులు వీరయ్య, కృష్ణ, శ్రీను, లక్ష్మణ్‌నాయక్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎడ్మసత్యం, దశరథ్‌నాయక్

పర్యావరణ పరిరక్షణ ముఖ్యం



మొక్క నాటుతున్న కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి

ఆమనగల్లు: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఐక్యత ఫౌండేషన్ సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఆమనగల్లు పట్టణంలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు జితేందర్, దశరథం, వజ్రపసాద్ రెడ్డి, జంగయ్య, రవీందర్‌నాయక్, మల్లయ్య, కృష్ణ నాయక్, రాములు, మానయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

తలకొండపల్లి: ఊరుకొండ మండలంలోని ఊరుకొండపేట్ అభయాంజనేయ స్వామికి రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకులు, సీఎల్ శ్రీనివాస్ యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవంలో మంగళవారం పాల్గొని స్వామి పల్లకీ మోశారు. ఈ సందర్భంగా శ్రీనివాసుయాదవ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడిచి ఆధ్యాత్మిక అనుభూతిని పొందాలన్నారు. కార్యక్రమంలో భక్తులు, భజనపరులు, వేద పండితులు, నాయకులు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న శ్రీనివాస్‌యాదవ్

ముహూర్తం ఎప్పుడు?

- షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి ఏడాదవుతున్నా ప్రారంభం కాని వైనం
- జాప్యం చేస్తున్న అధికారులు

కడ్తాల్: మండల కేంద్రంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి ఏడాదిన్నర కావొస్తున్న నేటికీ ప్రారంభించక పోవడంతో నిరుపయోగంగా మారాయి. పాలశీతలీకరణ కేంద్రానికి ఆర్థిక వనరులు సమకూర్చేందుకు షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. గత పాలకులకు ఇచ్చిన వినతుల మేరకు కార్యరూపం దాల్చి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయింది. కానీ ప్రారంభానికి నోచుకోక వెలవెలబోతోంది. తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య ఆధ్వర్యంలో 2022 జనవరిలో మండల కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్ర ఆవరణలో రూ.48 లక్షలతో నిర్మాణ పనులు ప్రారంభించారు.

ఆగస్టు నెల చివరి వారంలోనే పనులు పూర్తయ్యాయి. త్వరలోనే షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభమయ్యే అవకాశం ఉందని చిరు వ్యాపారులతో పాటు స్థానికులు గత ఏడాది నుంచి కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు.

నిరుపయోగంగా కాంప్లెక్స్

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయి ఏడాదిన్నర కావొస్తున్నా ప్రారంభించకపోవడం, వాటికి వేలం నిర్వహించకపోవడం, భవనాలు సైతం అద్దెకివ్వకపోవడం పట్ల స్థానికులు, చిరు వ్యాపారుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. షాపింగ్ కాంప్లెక్స్‌లో గదులు అద్దెకు తీసుకుని ఉపాధి పొందుదామని ఎదురుచూస్తున్న యువకులు, నిరుద్యోగులు నిరాశ చెందుతున్నారు. ప్రారంభించకుండా సంబంధిత అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై స్థానికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి.

నిరుద్యోగులకు ఉపాధి

మండల కేంద్రం కావడంతో జనాల తాకిడి భారీగా ఉంటుంది. కడ్తాల్ నడిబొడ్డున పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో ప్రభుత్వం వ్యాపార సముదాయం ఏర్పాటు చేస్తే ఎంతో సౌకర్యంగా ఉంటుందని స్థానికులు భావించారు. ప్రధాన రహదారికి ఇరువైపులా రోడ్లపై చిన్న చిన్న డబ్బాలు, కొట్లు ఏర్పాటు చేసుకొని గత కొన్నేళ్లుగా ఎంతో మంది జీవనం సాగిస్తున్నారు. శ్రీశైలం–హైదరాబాద్ రోడ్డు విస్తరణతో చిరు దుకాణాలన్నింటినీ తొలగించడంతో ఎంతో మంది వ్యాపారులు ఉపాధి కోల్పోయారు. సుమారు 50 కుటుంబాల వరకు నష్టం వాటిల్లింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్థానికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వెంటనే షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభించి, వేలం ఏర్పాటు చేస్తే కొంత మందికైనా ఉపాధి దొరికే ఆస్కారం ఉంది.

ఉన్నతాధికారులకు నివేదించాం



షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయి ఏడాదిన్నర కావొస్తున్న మాట వాస్తవమే. రోడ్లు, భవనాల శాఖ అధికారులు గతేడాది సెప్టెంబర్‌లో నెలలో షాపింగ్ కాంప్లెక్స్ భవనాన్ని పరిశీలించారు. ప్రారంభంపై చర్చించారు. ఇటీవలే పాడిపరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య ఎండీని కలిసి సమస్యను విన్నవించాం.

– చేగూరి వెంకటేశ్, విజయడెయిరీ సొసైటీ అధ్యక్షుడు, కడ్తాల్



నిరుపయోగంగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్

బీఆర్‌ఎస్ ఖాళీ అవడం ఖాయం

మహేశ్వరం: మహేశ్వరంలో బీఆర్‌ఎస్ పార్టీ ఖాళీ అవడం ఖాయమని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మన్సాన్‌పల్లికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, రేణుకాఎల్లమ్మ ఆలయ చైర్మన్ మురళిధర్‌తో పాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి లక్ష్మారెడ్డి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహేశ్వరం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అన్నారు. కొందరు పదవులు అనుభవించి కన్నతల్లిలాంటి పార్టీని వదిలి తమ స్వార్థం కోసం ఇతర పార్టీలోకి వెళ్లారని అన్నారు. నాయకులు వెళ్లినా కార్యకర్తలు బలంగా ఉన్నారని చెప్పారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై చాలా మంది స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ ఎనుగు జంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు ఈశ్వర్, కృష్ణానాయక్, బాల్‌రాజ్, రాజునాయక్, లాజర్, పాండునాయక్, సామ సురేందర్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.